సాక్షి
వరంగల్

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



● నర్సంపేట పట్టణ శివారు సర్వాపురం గ్రామానికి చెందిన పాలకుర్తి సుమన్‌కు కొన్నేళ్ల క్రితం రవళితో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల పాప కూడా ఉంది. మద్యానికి బానిసైన సుమన్ ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తాగొచ్చి భార్యతో గొడవపడిన సుమన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇటీవలే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



● చెన్నారావుపేట మండలం కాల్‌నాయక్ తండా శివారు బాల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య త్రిషకు అక్కల్‌చెడ శివారు నిమ్మనాయక్ తండాకు చెందిన ఇస్లావత్ తిరుపతితో 2021లో వివాహమైంది. వీరికి పది నెలల పాప ఉంది. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నువ్వు చనిపోతేనే మన మధ్య గొడవలు ఆగిపోతాయని తిరుపతి అనడంతో మనస్తాపానికి గురైన త్రిష బావిలో దూకి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది.



● నెక్కొండ మండలం వెంకటాపురం శివారు గంగదేవితండాకు చెందిన జాటోతు లచ్చిరాం వ్యవసాయం, ఇతర అవసరాల కోసం జాటోతు చక్రు వద్ద రెండేళ్ల క్రితం రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈనెల 11న చక్రు భార్య జబ్లీ అప్పు విషయమై ఇంటికి వెళ్లి నిలదీసింది. దీంతో వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన లచ్చిరాం బావి వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆవేశం..అనర్థం!

క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్న కొందరు

- అనాలోచిత నిర్ణయాలతో బంగారు భవిష్యత్ అంధకారం
- నెలన్నరలోనే కమిషనరేట్ పరిధిలో 15కుపైగా ఘటనలు
- ఒక్క క్షణం ఆలోచించాలంటున్న సైకాలజిస్టులు



సాక్షి, వరంగల్: జిల్లాలో నెలన్నర రోజుల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో మరణాలన్నీ క్షణికావేశంలో చోటుచేసుకున్నవే. వారికి కుటుంబం, బాధ్యతలున్నా వాటిని విస్మరించి ఏమాత్రం ఆలోచించకుండా ప్రాణాలు తీసుకుని బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకున్నారు. వీరు ఏమాత్రం ఆలోచించినా పై మూడు కుటుంబాలు జీవితాంతం ఆనందంతో ఉండేవి. వారి మరణంతో కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఆయా కేసుల్లో ఒక ఎనిమిదేళ్ల పాప, 10 నెలల పాప, మరో ఇద్దరు బాలురకు తీరని అన్యాయం జరిగింది. అయితే జాతీయ స్థాయిలో ఆత్మహత్యల పెరుగుదల రేటు 12 శాతం నమోదైందని నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి 40 సెకన్లకు ఒక ఆత్మహత్య జరుగుతోంది. ఈ ఏడాది దాదాపు 15కు పైగా ఆత్మహత్యలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగడం గమనార్హం.

అవగాహన కలిగిస్తున్నా...

కానీ.. మారుతున్న కాలానికి తగ్గట్టుగా పరుగులు తీయలేక కొందరు, ఆర్థిక, వ్యక్తిగత, మానసిక.. ఇలా ఎన్నెన్నో కారణాలతో తనువు చాలిస్తున్నారు. అయితే ఏదైనా బతికి సాధించుకోవాలని, ఆత్మహత్యలతో ఎలాంటి ప్రయోజనం లేకపోగా.. మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి జీవితాలను అంధకారంలోకి నెట్టినట్లవుతోంది. ఇలాంటి ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ సంఘం(ఐఏఎస్‌పీ) ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ), ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య(డబ్ల్యూఎఫ్‌ఎంహెచ్)ల సహకారంతో ఏటా సెప్టెంబర్ 10న 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం'గా నిర్వహిస్తున్నారు. దీనికితోడు హైదరాబాద్ బీబీనగర్ ఎయిమ్స్‌లో సైక్రియాటిక్ విభాగం ఆత్మహత్యల నివారణకు హెల్ప్‌లైన్ నంబర్ 94932 38208 కూడా అందుబాటులోకి తెచ్చింది.

ఆత్మహత్యలొద్దు.. ఆలోచించండి..



పోలీస్ స్టేషన్లలో నిత్యం ఆత్మహత్య కేసులు నమోదవుతున్నాయి. వీటిలో ఎక్కువగా చిన్న చిన్న కారణాలతోనే ప్రాణాలు తీసుకుంటున్నారని మా విచారణలో తేలింది. ఆ కారణాలను భూతద్దంలో చూసుకొని క్షణికావేశంలో బలవన్మరణాలతో కుటుంబాలను ఆగం చేస్తున్నారు. మీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు చాలావరకు స్వచ్ఛంద సంస్థలు కూడా టెలిఫోనిక్ కౌన్సెలింగ్ చేస్తున్నాయి. వారితో మాట్లాడండి. మీ బంగారు భవిష్యత్‌ను మంచిగా తీర్చిదిద్దుకోవాలి. – ఏవీ రంగనాథ్, వరంగల్ సీపీ

రేపటిని ఆహ్వానించాలి..



ఆత్మహత్య చేసుకోవడం అనేది స్వయంకృతాపరాధం. రోజూ కొత్త ఆశయాలతో నేటిని ఆస్వాదించి.. రేపటిని ఆహ్వానించడమే జీవన సాఫల్యం. చనిపోయి సాధించేది ఏమీ ఉండదు. మన సమస్యే అందరికంటే పెద్దదని నిత్యం ఆలోచించడం మరింత కుంగదీస్తుంది. ప్రాణాలు తీసుకునే వరకు వెళ్లి బయటపడిన వారి విజయగాథలను స్ఫూర్తిగా తీసుకోవాలి. విద్యార్థులు కూడా తల్లిదండ్రులు మందలించారని క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. – అనూష వినేయత, సైకాలజిస్టు

న్యూస్‌రీల్

16న స్పౌజ్ టీచర్ల సవరణ

కాశోజీ సెంటర్: గతంలో బదిలీ అయి ఎనిమిదేళ్లు పూర్తికాని స్పౌజ్ ఉపాధ్యాయులు ఈనెల 16న డీఈఓ కార్యాలయంలో హాజరై సవరించుకోవాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 2012, 2013, 2015 సంవత్సరాల్లో పదోన్నతి తిరస్కరించిన ఉపాధ్యాయులు, 2015, 2018లో బదిలీలో స్పౌజ్, ఇతర ప్రిఫరెన్షియల్ కేటగిరీని ఉపయోగించుకొని ఎనిమిదేళ్లు పూర్తికాని ఎస్‌జీటీ/ఎస్‌ఏ కేడర్ ఉపాధ్యాయులు, ఐదేళ్లు పూర్తి కాకుండానే జీహెచ్‌ఎం గ్రేడ్-2 వారు ఇప్పటి బదిలీల్లో తిరిగి ఉపయోగించుకున్నట్లయితే స్వచ్ఛందంగా 16న డీఈఓ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల్లోపు హాజరై తొలగించుకోవాలని సూచించారు. లేదంటే ఆఫీస్ రికార్డ్స్ ప్రకారం ఆ ఉపాధ్యాయులను స్పౌజ్ కేటగిరీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీ నుంచి తొలగిస్తారని, సీసీఏ రూల్స్ ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని డీఈఓ పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా మనీషా మెహ్రా బాధ్యతల స్వీకరణ



వరంగల్ లీగల్: వరంగల్ రెండవ అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా నియమితులైన మనీషా మెహ్రా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్కుర్తి ఆనంద్‌మోహన్, గుని గంటి శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీ రేవూరి శశిరేఖ, కోశాధికారి తమ్మిశెట్టి సుభాష్, సభ్యులు కొత్తపల్లి చిరంజీవి, కందుల శ్రీలత, వేలూరి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యావకాశాలపై సలహాలు అందిస్తా
పీఎస్‌లకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి
మాషూఖ్ రబ్బానీ ఉర్సు ఉత్సవాలు - 10లో▸

కుట్టు శిక్షణతో ఆర్థికంగా ఎదగాలి

- కేంద్రాలను సందర్శించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పెర్కవేడులో గౌన్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి: మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి కుట్టు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పెర్కవేడు, మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను మంత్రి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. శిక్షణ పొందుతున్న 50 మందిలో గైర్హాజరైన పలువురు మహిళలతో సరదాగా ఫోన్‌లో సంభాషించారు. కుట్టు శిక్షణకు గైర్హాజరైతే ఎలా.. రానివాళ్లను తీసేయాలని నాకు మీ ఎమ్మెల్యే చెప్పాడంటూ.. సరదాగా మాట్లాడారు. కుట్టు శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలు సైతం ఉన్నాయని, క్రమశిక్షణతో నేర్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్‌లు గారె నర్సయ్య, చిన్నాల తారశ్రీ రాజబాబు, సూదుల దేవేందర్, భద్రు నాయక్, ఎంపీటీసీ ఐత రాంచందర్, ఎండీ నయీం, ఏపీఎం పులుసు అశోక్‌గౌడ్, సీసీలు, నిర్వాహకులు టి.రమ, బిర్రు రమాదేవి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీవత్స



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవత్స

నర్సంపేట రూరల్: ప్రభుత్వం అధికారికంగా ఈనెల 19న నర్సంపేట పట్టణంలో నిర్వహించే లంబాడాల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వేడుకలకు లంబాడాలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ ఉదయ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి అంగోతు భద్రయ్య, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వాసునాయక్, డీటీడీఓ జహీరొద్దీన్, తహసీల్దార్ రామ్మూర్తి, సీఐ రమేష్, లంబాడ నాయకులు జేతురాంనాయక్, సుభాష్, కల్యాణ్, గంగయ్య, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ అశ్విని వాకడే



తొగర్రాయిలో పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అశ్విని తానాజీ

దుగ్గొండి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా తొగర్రాయి, పానకల్, లక్ష్మీపురం, దుగ్గొండి ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, డైనింగ్ హాళ్లు, ప్రహరీ, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. తొగర్రాయిలో పనులు వేగవంతంగా పూర్తి కావస్తుండటంతో సర్పంచ్ తిరుపతిరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పనులు పూర్తి చేసినా బిల్లులు రావడంలో ఆలస్యమవుతోందని అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె.. తనతో ఉన్న ఇంజనీరింగ్ అధికారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీపీ కాట్ల కోమల, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, ఊర్మిళ, సురేందర్, మంజుల, ఎంపీటీసీలు బండి జగన్, మోర్తాల రాజు ఉన్నారు.

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు



గుడుంబా పానకం, గుడుంబాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండలంలో వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీసులు దాడి చేసినట్లు సీఐ పవన్ తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లబెల్లి తోట్ల తండాలో గుడుంబా తయారీకి ఉపయోగించే చెక్కర, ఈస్టు పానకం 500 లీటర్లు, డ్రమ్ములు ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు భిక్షపతి, మూడు రవిలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీసులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

9మందిపై కేసు

డోర్నకల్: చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పరిధి దాటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డోర్నకల్ సీఐ జె.వెంకటరత్నం హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మున్నేరువాగు సమీపంలో లభ్యమైన మృతదేహం గురించి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. సిగ్నల్‌తండాకు చెందిన వ్యక్తిని హత్య చేసిందని ఆరోపిస్తూ ఓ మహిళపై దాడి చేసి, చెప్పులదండా మెడలో వేసిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మున్నేరువాగు సమీపంలోని మృతదేహం కేసు వివరాలను త్వరలో బయటపెడతామని సీఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన ఆటోడ్రైవర్ మేడ సురేశ్(33) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ సురేశ్‌కు గతంలో వివాహం కాగా కుటుంబ కలహాలతో విడాకులు తీసుకున్నాడు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. దీంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

బాలికపై లైంగికదాడి

గూడూరు: మానుకోట జిల్లా గూడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సతీష్‌గౌడ్ తెలిపారు. పానుగోడుకు చెందిన కర్రె వీరయ్య, చిర్రకుంటతండాకు చెందిన జరుపుల రమేష్‌లు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు, బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపారు.

పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు

- సీపీ ఏవీ.రంగనాథ్
- నేటి నుంచి 23వ తేదీ వరకు కేయూ మైదానంలో..
- హాజరుకానున్న 8,703 మంది అభ్యర్థులు



కేయూ మైదానంలో నిర్వహించిన ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

కాజీపేట అర్బన్ : నేటి నుంచి పూర్తి పారదర్శకంగా రెండో విడత స్టయిపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్, ఎస్సై అభ్యర్థుల దేహధారుఢ్య పరీక్షలను కేయూ మైదానంలో నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ మంగళవారం తెలిపారు. కేయూ మైదానంలో మంగళవారం నిర్వహించిన పీసీ, ఎస్సై అభ్యర్థుల ట్రయల్ రన్‌ను క్రైమ్ డీసీపీ మురళీధర్, పోలీస్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి, మాట్లాడారు. బుధవారం నుంచి ఎనిమిది రోజుల పాటు అభ్యర్థులకు దేహధారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో 8,703మంది పాల్గొంటారని పురుషులు 6,281, స్త్రీలు 2,422 మంది పాల్గొననున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులకు ఈనెల 16, 17వ తేదీల్లో ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తప్పుడు మార్గంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వ్యక్తులు, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే పోలీస్ కమిషనర్ నంబర్ 87126 85100 ద్వారా సమాచారం అందజేయాలని అన్నారు.

అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు ఇలా..

- రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి జారీ చేసిన అడ్మిట్ కార్డు, ఇంటిమేషన్ లెటర్ వెంట తీసుకురావాలి.
- అభ్యర్థి స్వీయ సంతకంతో కూడిన రెండు పార్ట్ దరఖాస్తు ఫారాలు.
- పురుషులకు 1,600 మీటర్లు, మహిళలకు 800 మీటర్ల పరుగు పందెం నిర్వహించబడుతుంది.
- పరుగు పందెంలో అర్హత సాధిస్తేనే ఎత్తు కొలతలు, లాంగ్‌జంప్ పరీక్షలకు అర్హత.
- నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థులు ఉదయం 5 గంటలలోపు శారీరక, దేహధారుఢ్య పరీక్షలకు హాజరుకావాలి. సమయపాలన పాటించకపోతే అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుంది.
- కేయూ మైదానంలో ప్రవేశించిన అభ్యర్థులు అన్ని రకాల పరీక్షలు ముగిసిన తర్వాతే బయటకు వెళ్లాలి.
- మైదానంలో సామాన్లు భద్రపరిచేందుకు ఎలాంటి క్లాక్ రూంలు అందుబాటులో ఉండవు, విలువైన వస్తువులను వెంట తీసుకు రాకూడదు.
- ద్విచక్రవాహనంపై వచ్చే అభ్యర్థులు కేయూ మొదటి గేట్ వద్ద పార్కింగ్ చేసి కాలినడకన రావాలి.
- బయోమెట్రిక్ పద్ధతిలో అభ్యర్థుల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు చేతి వేళ్లకు గోరింటాకు, ఇతర రంగులు వేసుకోకూడదు.
- అభ్యర్థులు ప్రతి ఈవెంట్ వద్ద, ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాల వద్ద క్యూ పద్ధతి పాటించాలి.

యజమానికి డ్రైవర్ల టోకరా

- రెండు జేసీబీల చోరీ
- ఒకరి అరెస్ట్.. పరారీలో మరొకరు
- వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం



నిందితులను మీడియాకు చూపుతున్న డీసీపీ

జనగామ: ఇద్దరు అన్నదమ్ములు.. ఓ వ్యక్తి వద్ద నమ్మకంగా పనిచేస్తున్నట్లు నటించారు. యజమానికే టోకరా ఇచ్చి.. రెండు జేసీబీలను ఎత్తుకెళ్లారు. ఈక్రమంలో పోలీసుల పన్నిన వలలో చిక్కారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి డీసీపీ పి.సీతారాం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మేవాత్ జిల్లా పుణ్హానా మండలం కలాన్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఎండీ స్వాలే, ఎండీ సోకిన్ బతుకు దెరువు కోసం 12 ఏళ్ల క్రితం తెలంగాణకు వచ్చారు. జేసీబీ డ్రైవర్లుగా పని చేశారు. కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన వారు జనవరి–2022లో ఛత్తీస్‌గఢ్‌లోని బీజీపూర్‌కు మకాం మర్చారు. అక్కడ జేసీబీ డ్రైవర్‌గా కొన్నాళ్లపాటు నమ్మకంగా పని చేశారు. జీతం డబ్బులు సరిపోక పోవడంతో సులభతరంగా సంపాదించాలనే ఆలోచనకు వచ్చారు. ఇదే అదనుగా యజమాని కదలికలను ఎప్పటికప్పుడు గమనించిన సోదరులు.. బీజాపూర్ నుంచి జేసీబీని చోరీ చేసి నేరుగా జనగామకు చేరుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జేసీబీని అద్దెకు నడిపిస్తూ మరో జేసీబీ చోరీకి ప్లాన్ వేసుకున్న క్రమంలో జనగామ సూర్యాపేట రోడ్డు ఏరియాలో కెనాల్ పనులు జరుగుతుండగా అక్కడ ఉన్న జేసీబీపై కన్నేశారన్నారు. కెనాల్ సమీపంలో పార్కు చేసి ఉన్న జేసీబీని 2022 ఆగస్టులో ఎత్తుకెళ్లి చంపక్‌హిల్స్ ప్రాంతంలోని రహస్య ప్రదేశంలో ఉంచారు. ఈ విషయమై యజమాని కేసు పెట్టడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈక్రమంలో నిందితుల సెల్‌ఫోన్ ఆధారంగా హర్యానా రాష్ట్రంలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసు బృందాలు ఆయా రాష్ట్రాలకు వస్తున్నట్లు తెలుసుకున్న నిందితులు అక్కడ నుంచి తప్పించుకున్నట్లు డీసీపీ తెలిపారు. జనగామతో పాటు బీజీపూర్‌లో సైతం జేసీబీ ఎత్తుకొచ్చినట్లు గుర్తించి, ఆ దిశగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. పక్కా సమాచారంతో డీసీపీ సూచనల మేరకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రఘుపతి, ఎస్కే జానీపాషా, సిద్దిపేట రోడ్డు చంపక్‌హిల్స్ ఏరియాలో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. దొంగిలించి రహస్య ప్రదేశంలో ఉంచిన జేసీబీని నిందితుడు ఎండీ సాల్వే తీసుకొస్తుండగా వడ్లకొండ క్రాస్ వద్ద పట్టుకున్నారు. సోకిన్ పరారీలో ఉండగా, సాల్వేతో పాటు రూ.60లక్షల విలువ చేసే రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని, కోర్టుకు పంపించారు. కేసు చేధనలో ప్రతిభ కనబరిచిన సీపీ, సీఐ, ఎస్సైలతో పాటు ఎండీ సల్మాన్ పాష(ఏఏఓ), ఏఎస్ఐ శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్ కె.రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు కె.మహేష్, టి.రామన్న, డి.కర్ణాకర్, కె.అనిల్ కుమార్, ఎం.అంజయ్య, బి.రామక్రిష్ణ తదితరులను డీసీపీ అభినందించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, పక్కన కలెక్టర్ శివలింగయ్య

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈమేరకు శివరాత్రి ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ లింగయ్యతో వివిధ శాఖల అధికారులతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి అభివృద్ధికి కేటాయించిన రూ.16.5 కోట్లతో పర్యాటక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. హరిత హోటల్ అభివృద్ధికి రూ.25 కోట్లు, బమ్మెర ఆలయ అభివృద్ధికి రూ.12.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వల్మిడిలో ఆలయ అభివృద్ధికి రూ.7.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 18న సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరుగబోయే కల్యాణం రోజున 2వేల మంది భక్తులకు భోజనం సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీఓ రాంరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, ఈఓ రజనీకుమార్, అధికారులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. వల్మిడి ఆలయ నూతన కమిటీకి నియామక పత్రాలను, మంచుప్పులలో కల్యాణ లక్ష్మి చెక్కును మంత్రి దయాకర్‌రావు అందజేశారు.

కేడీసీకి నేడు న్యాక్ బృందం రాక

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కేడీసీ)కు ఈనెల 15న నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ న్యాక్ కమిటీ బృందం రానుంది. కళాశాలలో అకాడమిక్ పరంగా, మౌలిక వసతుల పరంగా విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాబోధన, ఎక్స్‌ట్రాకరిక్యులమ్ ఏమేమి ఉన్నాయో 15, 16తేదీల్లో స్వయంగా పరిశీలించనుంది. ఈమేరకు మంగళవారం ఆ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడారు. న్యాక్ కోసం అన్ని విధాలుగా ఏర్పాట్లు పూర్తిచేశామని కేడీసీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మెరుగైన న్యాక్ గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే విద్యార్థులు అత్యధికంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో (అటానమస్ కాకుండా)కేడీసీ రెండోస్థానంలో ఉందన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంకన్న, లైబ్రేరియన్ శంకరయ్య పాల్గొన్నారు. కాగా, న్యాక్‌కమిటీలోని మెంబర్ కోఆరినేటర్ ఎంకే సింగ్ బుధవారం హనుమకొండకు చేరుకోగా.. ప్రిన్సిపాల్ రాజారెడ్డి కలిసి పూలబోకే అందించి స్వాగతం పలికారు.

పలు రైళ్లు రద్దు, మళ్లింపు

- మూడో రైల్వే లైన్ ఇంజనీరింగ్ బ్లాక్‌తో మకోడి–వీరూర్ మధ్య థర్డ్ లైన్ పనులు

కాజీపేట రూరల్: కాజీపేట– బల్లార్షా మార్గంలో వీరూర్– మకోడి రైల్వే స్టేషన్ల మధ్య కొనసాగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణ ఇంజనీరింగ్ పనుల కారణంగా ఈ రూట్‌లో నడిచే పలు రైళ్లను రద్దుతో పాటు మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు మంగళవారం రాత్రి కాజీపేట రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రైళ్లు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట– బల్లార్షా (17035) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, బల్లార్షా–కాజీపేట (17036) ఎక్స్‌ప్రెస్ 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, నాందేడ్ –నిజమాబాద్ (07854) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, నిజామాబాద్–నాందేడ్ (07853) 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, కాచిగూడ –కరీంనగర్ (07793) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, కరీంనగర్–కాచిగూడ (07794) ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17003) ప్యాసింజర్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు బల్లార్షా–కాజీపేట (17004) ప్యాసింజర్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, సిర్‌పూర్ –కరీంనగర్ (07766) ప్యాసింజర్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, కరీంనగర్–సిర్పూర్ (07765) ప్యాసింజర్ 15వ తేదీ వరకు 25వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

దూరం తగ్గిన రైళ్లు

భద్రాచలం రోడ్–బల్లార్షా (17033) ప్యాసింజర్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వరంగల్–బల్లార్షా మధ్య రద్దు, సిర్పూర్–భద్రాచలంరోడ్ (17034) ప్యాసింజర్ 15 నుంచి 24వ తేదీ వరకు సిర్పూర్–వరంగల్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై ఫిర్యాదు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన గట్టు నరేశ్ గీసుకొండ తహసీల్దారు కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఐ సాంబయ్యను దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరిస్తూ ఆడియో రికార్డును గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. అది వైరల్ కావడంతో.. తనను చంపుతానని బెదిరించడంతోపాటు దుర్భాషలాడిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గీసుకొండ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు. 'తాళ్ల వద్దకు వచ్చి ఏమో చేస్తానవట, మినిస్టర్‌నే ముప్పుతిప్పలు పెట్టినోన్ని, తాళ్ల జాగ నీ జాగీరు కాదు. చంపుతా నిన్ను, నీ ఇంటిలో నిన్ను తన్నిపోత.. పోలీసుల కు, డీఎస్పీకి ఫిర్యాదు చేసుకోపో.. ఇష్టం ఉన్నట్లు రికార్డులు మారుస్తానవట' అని నరేష్ వాయిస్‌తో ఉన్న ఆడియో రికార్డు వాట్సాప్‌లో వైరల్ అయింది.

భాషా పండిట్‌ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టు కార్డులతో విద్యార్థులు

చిల్పూరు: భాషా పండిట్‌ల సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు ప్రధాన న్యాయమూర్తికి మంగళవారం లేఖలు పంపారు. మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9వ తరగతి విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో భాషా పండిట్‌లు ఉన్నా వారి సమస్యలను పరిష్కరించకపోవడంతో బోధన చేయడం లేదని, అందుకు వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ చదువులు సక్రమంగా సాగాలంటే సమస్యలు తొలిగించి వారికి పదోన్నతులు లభించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

దొంగిలించిన సొమ్ము రికవరీ

ములుగు రూరల్: జాతీయ రహదారిపై ఉన్న అపోలో ఫార్మసీ వద్ద ద్విచక్రవాహనం నుంచి డబ్బులు దొంగిలించిన కేసును ములుగు పోలీసులు మంగళవారం చేధించారు. ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీన మండలంలోని కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్ పాషా తన ద్విచక్ర వాహనంలో రూ.2.59లక్షలు ఉంచి ఎదురుగా ఉన్న దుకాణంలో పని మీద వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే డబ్బులు లేకపోవడంతో ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి ఏపీలోని తాడేపల్లిగూడెంకు చెందిన వ్యక్తులుగా గుర్తించి పట్టుకుని, కేసు నమోదు చేసి, రూ.2.39లక్షలు రికవరీ చేసి, నిందితులను కోర్టులో హాజరపరిచినట్లు ఎస్సై ఓంకార్‌యాదవ్ వెల్లడించారు.

'పేట'లో మిస్సింగ్.. పట్నంలో ట్రేసింగ్?

- గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినుల అదృశ్యం
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు



వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల

వర్ధన్నపేట: ముగ్గురు విద్యార్థినులు వర్ధన్నపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి మంగళవారం కనిపించకుండా పోవడం జిల్లాలో కలకలం సృష్టించింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి కనిపించకుండా పోయిన ఈ మైనర్ల ఆచూకీ హైదరాబాద్‌లో దొరికినట్లు తెలిసింది. మైనర్లు అయిన ఆ ముగ్గురు విద్యార్థులలో ఒకరి వెంట సెల్ ఫోన్ ఉండడంతో వారి జాడ ట్రేసింగ్ అయినట్లు సమాచారం. దీనిపై పోలీసులు మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. వివరాల్లోకి వెళితే.. వర్ధన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు 8వ తరగతి విద్యార్థినులు, 9వ తరగతి చదువుతున్న మరో బాలిక మంచి స్నేహితులు. పట్టణంలోని తాళ్లకుంటతండాకు చెందిన ఇద్దరు, డీసీ తండాకు చెందిన ఓ విద్యార్థినిగా భావిస్తున్న వీరు ఎప్పుడూ స్నేహంగా ఉంటారు. అయితే వీరిలో ఓ బాలిక సోమవారం సాయంత్రం సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పొనక స్వరూపకు కనిపించారు. దీంతో సెల్ ఫోన్ వాడొద్దని, ఈ విషయం మీ తల్లిదండ్రులకు చెబుతానని మందలించారు. దీంతో రాత్రంతా దీని గురించి ఆలోచించిన ఆ ముగ్గురు తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో హాస్టల్‌ను విడిచివెళ్లారని అక్కడి విద్యార్థులు చర్చించుకుంటున్నారు. మంగళవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలో డైనింగ్ హాల్‌లోకి ఆ ముగ్గురు విద్యార్థినులు రాకపోవడంతో అనుమానం వచ్చి హాస్టల్‌లో వెతికితే కనిపించలేదు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. విద్యార్థినులు వారి ఇళ్లకు వెళ్లనట్లుగా తెలిసింది. దీంతో సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్వరూప ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ముగ్గురు మైనర్లు కావడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఉదయం నుంచి కనిపించకుండా వెళ్లిన విద్యార్థినులపై సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా?

హాస్టల్‌లో 189 మంది విద్యార్థినులు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. గతంలో ఈ హాస్టల్‌లో ఆహారం కలుషితం కావడంతో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన మరువకముందే విద్యార్థినుల అదృశ్యం ఆందోళన కలిగిస్తోంది. ప్రధాన ద్వారం తాళం వేసి ఉంటుంది. మంగళవారం తెల్లవారుజామున వెళ్లారా.. లేక సోమవారం రాత్రి పారిపోయారా.. అనే దానిపై స్పష్టత లేదు. వాచ్‌మెన్, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ ఉన్నప్పటికి విద్యార్థినులు ఎలా అదృశ్యమయ్యారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా ఇందులో హాస్టల్ వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

సహకార రంగం అభివృద్ధికి కృషి

- వేములవాడ శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్



అభివృద్ధిని వివరిస్తున్న వినయ్‌భాస్కర్

రామన్నపేట: సహకార రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో కల్పలత సూపర్‌బజార్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మంగళవారం హనుమకొండ సూపర్‌బజార్ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నప్పటికీ కొన్నిచోట్ల అంతంగా రాణించలేకపోతున్నాయని తెలిపారు. పట్టుదలతో పనిచేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయనేది చెప్పేందుకు ఉదాహరణ చీఫ్ వినయ్‌భాస్కర్ అని అన్నారు. చీఫ్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలకులు నష్టాల పేరుతో సూపర్‌బజార్‌కు ఆస్తులు అమ్మాలని చూశారని, కాని దానిని అడ్డుకుని రాష్ట్రం సిద్ధించిన తర్వాత అప్పులను ఆస్తులుగా మార్చి 50 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్పలత సూపర్‌బజార్ పలు సంఘాలకు ఆదర్శంగా నిలువడం శుభసూచికమన్నారు. చెన్నమనేని దంపతులను క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి, చీఫ్ విప్ దంపతులు అతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, సూపర్‌బజార్ చైర్మన్ వర్ధమాన్ జనార్దన్, ఎండీ జగన్మోహన్‌రావు, వైస్ చైర్మన్ షఫి, డైరెక్టర్లు దానం ప్రభాకర్‌రెడ్డి, స్నేహలత, స్వర్ణలత, కుడా డైరెక్టర్ శివశంకర్, తిచక్ర ఆటో పొదుపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది



బావిలో పడిన యువకుడు తాబేటి అభినవ్

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణానికి చెందిన తాబేటి అభినవ్ అనే మతిస్థిమితం లేని యువకుడు ప్రమాదవశాత్తు మంగళవారం బావిలో పడ్డారు. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది, సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది యువకున్ని బావిలోంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. పోలీసులు, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లూ కోల్ట్స్ సిబ్బంది రమేష్, రాజు, కృష్ణ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిపోతున్న వరిపొలం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న అధికారులు

మరిపెడ రూరల్: మానుకోట జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన రైతులు గణగాని నగేష్, అర్వపల్లి రామన్న చెరో ఐదు ఎకరాల చొప్పున యాసంగి వరి సాగు చేశారు. ఈక్రమంలో పొలంలో కలుపు తగ్గేందుకు కురవి మండలంలోని ఫర్టిలైజర్ షాపులో కలుపు గడ్డి మందును కొనుగోలు పొలానికి పిచికారీ చేశారు. కలుపు మందు ఎఫెక్ట్ కారణమో, మరే ఇతర కారణమోగాని వరి పొలం కుదుళ్లు కుళ్లిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ మేరకు 'కలుపు మందు కొడితే'..అనే శీర్షికతో సోమవారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన మరిపెడ వ్యవసాయ అధికారులు బాధిత రైతులు, పురుగు మందు షాపు యజమాని, మందుల కంపెనీ ఉద్యోగులతో కలిసి వరి పొలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మరిపెడ ఏఓ వీరసింగ్ మాట్లాడుతూ.. కుళ్లిపోతున్న వరి పొలాల గురించి మల్యాల శాస్త్రవేత్తలకు తెలియజేశామన్నారు. వారు వచ్చి పరిశోధన చేసి వెల్లడించిన కారణాలను బట్టి చర్యలు ఉంటాయని ఏఓ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావంతి, సర్పంచ్ చిత్తనూరి అనూష, రైతులు పాల్గొన్నారు.